## ఇద్దరు సిఐలపై సస్పెన్షన్ వేటు : సిపి అవినాష్ మహంతి

హైదరాబాద్, డిసెంబరు 28 ప్రభాతవార్త



సిపి అవినాష్ మహంతి

సైబరాబాద్ పరిధిలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లపై సస్పెన్షన్ వేటు పడింది. కేపిహెచ్‌బి పరిధిలో సీఐ వెంకట్‌తో పాటు మరో సీఐ శ్రీనివాసులను సస్పెండ్ చేస్తూ సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. ఓ వ్యక్తిని అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలకు గురి చేశారనే ఆరోపణల నేపథ్యంలో సీపీ వీరిని సస్పెండ్ చేవారు. వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ పరిధిలో ఓ కేసులో ఎంక్వయిఇరీ నిమిత్తం ప్రణీత్ అనే యువకుడిని స్టేషన్‌కు తీసుకువచ్చి దారుణంగా కొట్టడమే కాకుండా థర్డ్ డిగ్రీ ఉపయోగించారని బాధితుడు ఆరోపించారు. తన భార్య ఇచ్చిన ఫిర్యాదుతో అరికాళ్లు, చేతులపై లాఠీలతో బాదారని చెప్పారు. ఉదయం నుంచి రాత్రి వరకూ తనను కొట్టారని..అసభ్యంగా దూషించారని దాడి ఘటనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని సీపీ దృష్టికి తీసుకెళ్లారు బాధితుడి కుటుంబసభ్యులు. తీవ్రమైన గాయాలతో కొండాపూర్ ప్రభుత్వ అసుపత్రిలో చికిత్స తీసుకొని అనంతరం గాంధీ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్న బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వెంటనే సీపీ విచారణకు ఆదేశించారు. దీనిపై దర్యాప్తు జరిపి పూర్తిస్థాయిలో నివేదిక ను సమర్పించాలని ఆదేశించారు. అలాగే ఓ కేసు విషయంలో నిర్లక్ష్యం వహించిన కారణంగా ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.శ్రీనివాస్‌పై వేటు పడింది.

హైదరాబాద్ వార్త



# ప్రజాపాలనకు "అప్లికేషన్ కష్టాలు



- -గ్రేటర్‌లో 600కౌంటర్లు ఏర్పాటు చేసిన అధికారులు
- -కౌంటర్ల వద్ద పెద్దఎత్తున జనం క్యూ
- -తొలిరోజే పలు ప్రాంతాల్లో దరఖాస్తుల కొరత
- -రూ.50నుంచి 100కి జిరాక్స్‌సెంటర్లలో కొనుగోలు
- -జిరాక్స్ కాపీలను తీసుకోమంటున్న అధికారులు
- -జనవరి 6లోపు ఎప్పుడైనా ఇవ్వొచ్చని సూచన





**హైదరాబాద్, డిసెంబరు 28,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ఆరుగ్యారెంటీలను వందరోజుల్లోపు అమలు చేసేలా కార్యాచరణ మొదలుపెట్టిన నేపథ్యంలో ప్రజల నుంచి దరకాస్తులు స్వీకరిస్తుంది. ఇందుకు గ్రేటర్ హైదరాబాద్‌లోని 150 మున్సిపల్ డివిజన్ల లో 600కౌంటర్లను ఏర్పాటు చేసింది. ఈకౌంటర్ల ద్వారా జనవరి 6వరకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈనేపథ్యంలో గురువారం ఉదయం బంజారాహిల్స్ డివిజన్‌లోని సిఎంటిసి సెంటర్‌లో ప్రజాపాలన కార్యక్రమాన్ని హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించి ప్రజలకు దరఖాస్తులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి దరఖాస్తులను పూర్తి చేసే విధానం ,దాంతోపాటు జతపరచాల్సిన పత్రాల గురించి వివరించారు. అయితే గ్యాంరెంటీల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఉదయం 7గంటల నుంచే జనాలు పెద్దఎత్తున కౌంటర్ల వద్దకు చేరుకున్నారు. దీంతో కార్యక్రమం ప్రారంభించిన కేవలం మూడు గంటల్లోనే నగరంలోని చాలా కౌంటర్లలో దరఖాస్తులు అయిపోయాయని అధికారులు చేతులెత్తేయడంతో తిరిగి రేపు ఉదయం రావవాలని సూచించడంతో ప్రజలు నిలదీశారు. ఇలా బంజారాహిల్స్ ఎంజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్‌కు వచ్చిన ప్రజలు తమకు దరఖాస్తు ఫారాలు ఇవ్వాలని సిబ్బందిని నిలదీశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని ప్రజలను సుమదాయించి పంపించారు. ఈవిషయంపై కౌంటర్లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని ప్రశ్నించగా ,కార్యక్రమం మొదటిరోజు కావడంతో ఈసమస్య తలెత్తిందని రేపటినుంచి కార్యక్రమాన్ని సజావుగా నిర్వహిస్తామని సమాధానం ఇచ్చారు.

**చందానగర్ మీసేవాకేంద్రం వద్ద గందరగోళం..**

ప్రభుత్వం ఆరుగ్యాంరెంటీల అమలుకు ప్రజాపాలన సెంటర్లను ఏర్పాటు చేయడంతో కేంద్రాల వద్ద జనాలకు బారులు తీరారు. చందానగర్ సర్కిల్ కార్యాలయం పక్కనే ఉన్న మీసేవా కేంద్రానికి పెద్దసంఖ్యలో జనం తరలిరావడంతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. స్టాప్‌తక్కువగా ఉండటం, జనాలకు ఎక్కువగా రావడంతో మీసేవా సిబ్బంది చేతులెత్తేశారు. మాదరఖాస్తులు తీసుకోవాలంటే మాదరఖాస్తులు తీసుకోవాలంటూ ఎగబడ్డారు.దీంతో త్రీవ గందరగోళ పరిస్థితి నెలకొంది. పోలీసులు అక్కడికి చేరుకుని జనాలను నివారించేందుకు ప్రయత్నించారు. పోలీసులే మీసేవా కేంద్రంలో టేబుల్స్‌పైకి ఎక్కి జనాలను గొడవ చేయకుండా అడ్డుకున్నారు.

**జనవరి 6లోపు ఎప్పుడైనా ఇవ్వొచ్చు...**

ఇప్పటికే ఆసరా ఫించన్ పొందుతున్న వారెవరూ మళ్ళీ దరఖాస్తుల పెట్టాల్సిన అవసరం లేదని అధికారులు క్లారిటీ ఇచ్చారు. కొత్త చేయూత ఫించన్ కోసం మాత్రం దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. దరఖాస్తు ఫారాలను ఉచితంగా పంపిణీ చేస్తామని బయట కొనుగోలు చేయద్దని సూచిస్తున్నారు. మున్సిపల్,వార్డు కార్యాలయాల్లో తమ దరఔఖాస్తులను జనవరి 6వ తేదీలోపు ఎప్పుడైనా ఇవ్వొచ్చని మిస్సవుతున్నామని ఆందోళన చెందవ్దని పేర్కొంటున్నారు.

**దరఖాస్తులు జీరాక్స్ తీసుకోంటున్నారు : ఎమ్మెల్యే రాజాసింగ్**

ఆరుగ్యాంరెంటీలకు దరఖాస్తు కోసం ఫామ్ ఇవ్వకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అధికారులపై గోషామహాల్ ఎమ్మెల్యే రాజాసింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం అభయహస్తం -ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గోషామహాల్ ,మంగళ్‌హాట్ డివిజన్‌లను ఎమ్మెల్యే రాజాసింగ్ సందర్శించారు. ఈసందర్బంగా ఆయన ప్రజాపాలన ఏర్పాట్లపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వార్డు కార్యాలయాల్లో ప్రజలకు దరఖాస్తు ఫామ్స్ ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. జీరాక్స్ తీసుకోవాలని లేదంటే ఒక్కో దరఖాస్తు ఫామ్‌కు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని ధ్వజమెత్తారు.

## భాగ్యలక్ష్మి మందిరంలో అమిత్ షా పూజలు



కేంద్ర హోం మంత్రి అమిత్ షా చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరాన్ని సందర్శించినప్పటి చిత్రం

**చార్మినార్,డిసెంబరు 28 ప్రభాతవార్త :** కేంద్ర హోం మంత్రి అమిత్ షా గురువారం చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మ వారి మందిరాన్ని సందర్శించారు. గురువారం సాయంత్రం నాలుగు గంటల పది నిమిషాలకు చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేరుకున్నారు.మందిరం ఆలయ మర్యాదలతో కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు స్వాగతం పలికారు.శ్రీ భాగ్యలక్ష్మి అమ్మ వారికి అమిత్ షా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మ వారి ఆశీస్సులు పొందారు.మందిరం ట్రస్టీ శశికళ అమిత్ షాకు శ్రీ సీతారాములు,హనుమంతుల వెండి చిత్ర పటానికి బహుకరించారు.అనంతరం ఆయన బిజెపి నాయకులతో కలిశారు.కాగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా 2020వ సంవత్సరం నవంబరు 29వ తేదీన మొదటి సారి చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరాన్ని సందర్శించారు.మళ్లీ రెండవ సారి అమిత్ షా గురువారం శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు సతీష్ అగరా ్వల్,ఎం.కుమార్,పవన్ మిశ్ర, చేతన్ సూరి,మెఘారాణి అగర్వాల్,మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ,శివచంద్ర,డి,ఆనంద్ గుప్తా,అశోక్ సేన్‌తో పాటు అధిక సంఖ్యలో పాతబస్తీకి చెందిన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పాతబస్తీకి విచ్చేసిన సందర్బంగా చార్మినార్ ఎసిపి రుద్ర భాస్కర్ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏం చేశారు.



## నగరంలో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టివేత




**హైదరాబాద్, డిసెంబరు 28 ప్రభాతవార్త**

నగరంలో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టుబడింది. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముగ్గురు అంతరాష్ట్ర డ్రగ్ ముఠాలను పోలీసులు పట్టుకున్నారు. న్యూ ఇయర్ కోసం మహారాష్ట్ర నుంచి డ్రగ్స్ తీసుకొస్తున్న ముగ్గరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఏడు లక్షల విలువైన 100 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.డ్రగ్స్ పట్టుబడటంపై సెంట్రల్ జోన్ డీసీపి శరత్ పవార్ మీడియాతో మాట్లాడుతూ కొత్త సంవత్సర వేడుకల్లో విక్రయించేందుకు మహారాష్ట్ర నుంచి తీసుకువచ్చారని తెలిపారు. రూ.2000లకు ఒక గ్రాము కొని హైదరాబాద్‌లో ఏడు వేలకు అమ్ముతున్నారని తెలిపారు. నిందితులు మహారాష్ట్రలో ఒక నైజీరియన్ జ్యో నుంచి కొన్నట్లు ఒప్పుకున్నారని తెలిపారు. పరారీలో వున్న జ్యో కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ అమ్మేవారిపై, కొనే వారిపై తమ పోలీసులు నిఘా ఉందని సెంట్రల్ జోన్ డీసిపి శరత్ పవార్ స్పష్టం చేశారు.

## వెంకన్న ఆలయాన్ని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

**చిక్కడపల్లి, డిసెంబరు 28 ప్రభాతవార్త:**

చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవీదేవి కుటుంబ సభ్యులతో గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాసోత్సవాల సందర్భంగా జరుగుతున్న ఉత్సవాల్లో పాల్గొనేందుకు జస్టిస్ మాధవీదేవి ఆలయానికి చేరుకున్న సమయంలో ఆలయం వ్యవస్థాపక వంశీయుడు జి.శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయులు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను అందించి శ్రీవారి శేషవస్త్రాలను అందించిన అనంతరం ఆశీర్వచనం చేశారు. ఆలయంలో జరుగుతున్న కార్యక్రమాలను ఆలయం నిర్వాహకులు జస్టిస్ టి.మాధవీదేవికి వివరించారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవి

## పైరవీలకు తావు లేదు ..అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి లబ్ధి

### -జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, డిసెంబరు 28,ప్రభాతవార్త:** ప్రజాపాలన కార్యక్రమంలో ఎలాంటి పైరవీలు లేకుండా అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం బంజారాహిల్స్ వార్డు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 6వ తేదీవరకు అభయహస్తంలో భాగంగా దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని అన్నారు. ప్రజలకు ఎలాంటి అనుమానాలు, సందేహాలు ఉన్నా అధికారులను అడగాలని ఎలాంటి ఆధారాలు లేకున్నా దరఖాస్తు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి అన్నారు. కొత్త రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీకి ప్రజలు పదేళ్ల తర్వాత అధికారం ఇచ్చారని, ఇచ్చిన హామీల మేరకు అమలు చేయుటకు ప్రజల వద్దకు పాలన పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, కార్పొరేటర్ విజయారెడ్డి, జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మేయర్ విజయలక్ష్మి తదితరులు

## అగ్రస్థానంలో లాహిరి, బన్నీ

### -తెలంగాణ రాష్ట్ర సెయిలింగ్‌ఛాంపియన్‌షిప్



విజయం సాధించిన లాహిరి కొమరవెల్లి

**హైదరాబాద్, డిసెంబరు 28,ప్రభాతవార్త:**

తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లో తెలంగాణ రాష్ట్ర సెయిలింగ్‌ఛాంపియన్‌షిప్ సందడిగా సాగుతుంది. సబ్ జూనియర్స్ బాలికల విభాగంలో తొలి రోజు గురువారం జరిగిన మూడు రేసుల్లో హైదరాబాద్ జిల్లాలకు ప్రాతినిథ్యం వహిస్తున్న రసూల్‌పురాకు చెందిన ఉద్బవ్ స్కూల్‌కు చెందిన లాహిరి కొమరవెళ్ళి విజయం సాధించి నారీ శక్తిని చూపెట్టింది. 3పాయింట్లతో అగ్రస్థానంలో దూసుకెళ్తున్న లాహిరికి గట్టిపోటీ ఇస్తున్న ఆమె సోదరి దీక్షిత (10పాయింట్లు)రెండవ స్థానంలో నిలిచింది. బిందు రత్లావత్ (27పాయింట్లు)తో మూడోస్థానంలో ఉంది. ఈపోటీల్లో బాలురు, బాలికలు అందరూ ఒకే ఫ్లీట్‌లో పోటీపడుతున్నారు. ఇక బాలుర విభాగంలో వికారాబాద్‌కు చెందిన టాప్‌సీడ్ బన్నీ బొంగూరు (12 పాయింట్లు )కొంచెం ఫామ్‌లో కనిపించకపోయినా అగ్రస్థానంలో ఉన్నాడు. పెద్దగా అంచనాలు లేని వినోద్ దుండూ (14 పాయింట్లు), సాత్విక్ ధోకీ (24పాయింటున్న )2,3 వ స్థానాల్లో నిలిచి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈఅండర్ 16 ఛాంపియన్‌షిప్ పోటీల్లో తేలికపాటి గాలులు కేవలం 31కిలోల మాత్రమే ఉన్న లాహిరికి సాయం చేయగా ..45కిలోల బరువున్న ఆమె సోదరి దీక్షితకు చలాల ప్రతికూలంగా మారాయి. తక్కువ బరువున్న సెయిలర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన హాఫ్‌రిగ్ సెయిల్స్‌లను ఉపయోగించి జూనియర్ విభాగం సెయిలర్లు నేడు పోటీపడనున్నారు.

## చిక్కడపల్లి శ్రీవారి హుండి ఆదాయం రూ.25లక్షల 93వేల 373



హుండి లెక్కింపు జరిగిన దృశ్యం

**చిక్కడపల్లి, డిసెంబరు 28 ప్రభాతవార్త:**

కలియుగ ప్రత్యక్షదైవం చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండి లెక్కింపు గురువారం జరిగింది. మూడు నెలలకు రూ.25లక్షల 93వేల 373 ఆదాయం లభించింది. ఆలయం వ్యవస్థాపక వంశీయుడు జి.శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామంజనేయులు సమక్షంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. దేవాలయం అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

## అయ్యప్ప దేవాలయంలో 30 నుండి వార్షికోత్సవ వేడుకలు

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 28, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వివేకానందనగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో 32వ వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు ఈ నెల 30వ తేదీ నుండి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఎంతో హంగు ఆర్భాటాలతో రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించే మహా పడిపూజ కార్యక్రమాలను ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. ఇక్కడి ఆలయంలో అరుణ్ గురుస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ప్రాంతాలకు చెందిన వేలాదిమంది అయ్యప్ప భక్తులు ఇక్కడ జరిగే పూజా కార్యక్రమంలో పాల్గొంటుంటారు. వారి వారి కుటుంబ సభ్యులతో కలసి ఈ పూజ కార్యక్రమాలలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి హరిహరపుత్రుని సన్నిధిలో పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితాగ వస్తోంది. ఈ నెల 30వ తేదీ శనివారం ఉదయం 9గంటలకు 108 కలశములతో అయ్యప్ప స్వామికి అభిషేకం సాయంత్రం కూకట్‌పల్లి కాలనీ పురవీధుల్లో ఏనుగు అంబారి ఊరేగింపు మహోత్సవం, ఆదివారం నాడు 18 కలశములతో మహాపడి పూజా, మహా అన్నదాన కార్యక్రమం ఉంటుంద ని తెలియజేశారు. అదేరోజు రాత్రి అంబారి ఊరేగింపు పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.


సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద పిజెఆర్‌కు నివాళులర్పిస్తున్న జంపనప్రతాప్, డి.బి.వేందర్ తదితరులు


పీజేఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


పీజేఆర్ నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

# పిజెఆర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

**కంటోన్మెంట్‌లో...**

**కంటోన్మెంట్,డిసెంబర్ 28 ప్రభాతవార్త:** పేద ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన మాజీ మంత్రి పి.జనార్ధన్ రెడ్డి ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకొని యువత ఆయన అడుగు జాడల్లో ముందుకు రావాలని కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్,కంటోన్మెంట్ నేత డి.బి.దేవేందర్‌లు తెలిపారు. పిజెఆర్ 16వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద పిజె.ఆర్. కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్ బాబు, కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన వివిధ పార్టీల నాయకులు ప్యారసాని రామ్‌కుమార్, శ్రీనివాస్, రమేశ్, ఆకుల నాగేశ్, వరదారాణి తదితరులు పాల్గొన్నారు.

**కెపిహెచ్‌బి కాలనిలో...**

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 28, ప్రభాతవార్త :** మాజీ సీఎల్పీ దివంగత నేత పీజేఆర్ 16వ వర్ధంతి కార్యక్రమాన్ని పీజేఆర్ ఫౌండేషన్ కూకట్‌పల్లి నియోజకవర్గం అధ్యక్షులు కర్క నాగరాజ్ ఆధ్వర్యంలో మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విచ్చేసి పీజేఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లడుటూ కార్మికుల పక్షపాతిగా, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ స్వపక్షం అయిన విపక్షం అయిన ప్రభుత్వాలతో అలుపెరుగని పోరాటం చేసిన ప్రజానాయకుడు పి.జనార్ధన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్, బిజెపి నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, బాలాజీనగర్ కార్పోరేటర్ శిరీష బాబురావు, మాజీ కార్పోరేటర్ బాబురావు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కర్క పెంటయ్య, తూము శ్రీనివాసరావు, సతీష్ అరోరా, అంబటి శ్రీనివాస్, అంబేద్కర్ నగర్ బస్తీ మాజీ అధ్యక్షులు కర్క స్వామి, కర్క డాకయ్య, శారదారెడ్డి, బషీర్, జిల్లా గోపాల్, కర్క రవీందర్, భాశెట్టి, నర్సింగరావు, కర్క శివశంకర్, దినేష్, కేబుల్ శ్రీను, తూము మనోజ్, సాధుప్రతాప్‌రెడ్డి, తూము వేణు, తూము వినయ్, తూము సంతోష్, సతీష్‌రెడ్డి, రఘు, సి.భాస్కర్, రాచమళ్ళ శేఖర్‌గౌడ్, సునీల్‌యాదవ్ పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.

**కూకట్‌పల్లి నియోజకవర్గంలో**

కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఖచ్చితంగా పేద ప్రజలందరికీ ఆరు గ్యారంటీలను అందిస్తామని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని పూర్తి స్థాయిలో బలపరచాలని మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ 138 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా నియోజకవర్గంలోని పలు డివిజన్‌లలోని పలు ప్రాంతాలలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు పి.నాగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎడ్ల మోహన్‌రెడ్డి, యూత కాంగ్రెస్ నాయకులు ఎండి మోయిజ్, కాంగ్రెస్ కమిటీ, డివి జన్ అధ్యక్షులు కృష్ణరాజ్‌పుత్, మధుగౌడ్‌ల ఆధ్వర్యంలో గురువారం ఏర్పా టు చేసిన ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో మేడ్చల్ మల్కాజగిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జీ బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల గొట్టిముక్కల వెంకటేశ్వరరావులు ముఖ్య అతిథులుగా విచ్చేసి కేక్ కట్‌చేసి కాంగ్రెస్ పార్టీ జెండాలను అవిష్కరించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్ష, మాజీ మంత్రి స్వర్గీయ పి.జనార్ధన్‌రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం డివిజన్‌లలో నిర్వహిస్తున్న ప్రజాపాలన అభయహస్తం గ్యారెంటీ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ 138వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ అన్నారు. మన ప్రజా ప్రభుత్వంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడానికి ఆరు గ్యారెంటీ పథకాల దరఖాస్తుల కార్యక్రమానికి శ్రీకారాం చుట్టిందన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పాటు పడుతుందన్నారు. దగాపడ్డ తెలంగాణ ప్రజలను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాజకీయాలకు అతీతంగా అర్హులైన అబ్ధిదారులందరికీ 6 గ్యారెంటీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకురాళ్ళు, యూత్ కాంగ్రెస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య నమ్మాళ్వార్ పరమపదోత్సవం


నమ్మాళ్వార్ పరమపదోత్సవ కార్యక్రమం నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, డిసెంబరు 28 ప్రభాతవార్త:**
ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నమ్మాళ్వార్ పరమపదోత్సవ కార్యక్రమం ఆలయం వ్యవస్థాపక వంశీయుడు జి.శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామంజనేయులు ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముందుకు ఉత్సవానికి సంబంధించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా 2024 జనవరి 11న ఉదయం ఐదున్నర గంటలకు కుడారై ఉత్సవం ఉంటుందని, 14న భోగి పండుగ సందర్భంగా రాత్రి ఏడు గంటలకు గోదా సమేత రంగనాథస్వామి వారి కల్యాణం ఉంటుందని, 15న మకర సంక్రమణ పర్వదినోత్సవం సందర్భంగా ఉత్తరాయ పుణ్యకాలం ఉంటుందన్నారు. 16న కనుమ పండుగ సందర్భంగా ఉదయం 11 గంటలకు గోదా అమ్మవారి కరినోము ఉత్సవాలుంటాయని, భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు. వైకుంఠ ద్వారదర్శనం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయం అధికారులు వెల్లడించారు.

## జవహర్‌నగర్‌లో కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**చిక్కడపల్లి, డిసెంబరు 28 ప్రభాతవార్త:**
గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యునిటీ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆ పార్టీ సీనియర్ నేతలు మారిశెట్టి నర్సింగరావు, గుండు జగదీశ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆవిర్భావం నుంచి పార్టీ పటిష్టత కోసం కృషి చేసిన నేతలను స్మరించుకున్నారు. ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అరవింద్‌కుమాదవ్ హాజరై ప్రసంగించారు. ముఖ్యంగా పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ, ఇందిరాగాంధీ సేవలను నేతలు కొనియాడారు. కాంగ్రెస్ పార్టీకి నిజం, అహింసే పునాదులు అని, ప్రేమ, గౌరవం, సమానత్వం మూలస్తంభాలు అని అన్నారు. దేశభక్తిని రగిలించే కాంగ్రెస్ పార్టీలో తాము ఉన్నందుకు గర్వపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అరుణ జయేందర్, కాంగ్రెస్ పార్టీ నేతలు గుర్రం శంకర్, గుర్రం చంద్రకళ, జయేందర్‌బాబు,హఫీజ్, రాజు, యాదగిరి, శశుకుమార్, శ్రీను, ఆకార్, శ్రీరామ్, మధుకర్, దినేష్, రమేశ్, వేణు, గుండు సురేందర్, సలామ్, మల్లేష్, సురేశ్, జైరామ్ తదితరులు పాల్గొన్నారు.

## అందరికి దరఖాస్తు ఫారాలు అందేలా చూడాలి


దరఖాస్తు ఫారాలను అందజేస్తున్న కార్పోరేటర్

**హైదరాబాద్, డిసెంబరు 28 ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభయ హస్తం ప్రజా పాలన దరఖాస్తులు ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని గోల్నాక కార్పోరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ అధికారులకు సూచించారు. ఈ మేరకు గురువారం డివిజన్‌లోని గంగానగర్, తులసీరామ్‌నగర్, నెహ్రూనగర్‌లోని ప్రజలకు దరఖాస్తు ఫారాలు పంపిణి చేశారు. కాని ప్రజలకు కావాల్సినన్ని దరఖాస్తు ఫారాలు లేకపోవడంతో ఇబ్బందులకు గురైనారు. ప్రతి ఒక్కరికి ఆరు గ్యారంటిలు అందేలా కార్యకర్తలు, నాయకులు, అధికారులు కృషి చేయాలని ఆమె కోరారు.

## ప్రజాపాలన సెంటర్లను పరిశీలించిన కార్పొరేటర్

**బేగంపేట డిశంబరు 28,ప్రభాతవార్త**
తెలంగాణా ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన సెంటర్లను రాంగోపాల్‌పేట కార్పోరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్ గురువారం పరిశీలించారు.రాంగోపాల్‌పేట డివిజన్‌లో ప్రజా పాలన కేంద్రాలకు వచ్చిన ప్రజలకు అధికారుల నుంచి సరైన స్పందన లభిస్తుందా అన్న విషయాన్ని ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా చీరె సుచిత్రా శ్రీకాంత్ మాట్లాడుతూ పేద ప్రజల కోసం వివిధ రకాలైన సెంటర్లను ఏర్పాటు చేయడం సంతోషమని,వాటి ద్వారా అందించిన దరఖాస్తులను వీలయినంత వేగంగా పరిశీలించి వారికి న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

## ప్రతి ఒక్కరూ అంధులకు సేవలు అందించాలి : కార్పొరేటర్


దేవనార్ అంధుల పాఠశాలలో అన్నదానం చేస్తున్న రాంగోపాల్‌పేట కార్పోరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్

**బేగంపేట డిశంబరు 28,ప్రభాతవార్త**
ప్రతి ఒక్కరూ అంధులకు వారికి తోచిన సహాయం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాంగోపాల్‌పేట కార్పోరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్ అన్నారు. బుధవారం ఆమె జన్మదినోత్సవ వేడుకలను బేగంపేట మయూరిమార్గ్‌లోని దేవనార్ అంధుల పాఠశాలలో జరుపుకున్నారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పాఠశాలలోని విధ్యార్థులకు చీరె సుచిత్రా శ్రీకాంత్ దంపతులు అన్నదానం చేసారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవనార్ అంధుల పాఠశాలలో విధ్యార్థులు ఎంతో ప్రతిభ కలిగిన వారు ఉన్నారని,వారు విధ్యతో పాటు వివిధ క్రీడలలోనూ తమ సత్తా చాటుతుండటం అభినందించదగిన విషయమన్నారు. ఈ సందర్భంగా దేవనార్ అంధుల పాఠశాల ఫౌండర్ ఛైర్మన్ సాయిబాబా గౌడ్,కరస్పాండెంట్ జ్యోతిగౌడ్‌లకు కార్పోరేటర్ కృతజ్ఞతలు తెలియజేసారు.

## వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల మేధాశక్తిని పెంచుతాయి : ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి డిసెంబరు28,ప్రభాతవార్త :**
వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థినీ విద్యార్థుల మేధాశక్తిని పెంచుతాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గురువారం చిక్కడపల్లి సెయింట్ ఆడమ్స్ హైస్కూల్‌లో క్వెస్ట్ పేరుతో 'సైన్స్‌ఫెయిర్' స్కూల్ అధినేత డాక్టర్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంకేతికపరమైన ఆకృతులు అందరిని ఆలోచింపచేశాయి. వారితో ఎమ్మెల్యే ముఠాగోపాల్ ముచ్చటించి ఏ విధంగా తయారు చేశారు, ఎవరు స్ఫూర్తి, ఏ విధంగా భవిష్యత్తు ముందుకు వెళ్తారు, ఉన్నత చదువులు పూర్తయిన తర్వాత దేశానికి ఏ విధంగా సేవ చేయాలనుకుంటున్నారు తదితర వాటిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వైజ్ఞానిక రంగంలో దేశం అగ్రరాజ్యాలతో సమానంగా ముందుకు సాగుతోందని, చంద్రుడి వద్దకు వెళ్లేంత స్థాయికి దేశం ఎదిగిందని అన్నారు. ప్రతి ఒక్కరు ఉన్నత చదువులు చదివి దేశానికి సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్లానెటరీ సొసైటీ అధ్యక్షుడు రఘునందన్, విశ్రాంత రసాయన శాస్త్ర ప్రొఫెసర్, మెనిబుక్స్ రచయిత కోయ వెంకటేశ్వరరావు, ముషీరాబాద్ మండల్ ఉప విద్యాశాఖాధికారిణి చిరంజీవి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

## జనవరి 1న 'మహార్ రెజిమెంట్ విజయ్ దివస్-206'వ మహోత్సవాలు

**సైఫాబాద్, డిసెంబరు 28 ప్రభాతవార్త:** జనవరి 1వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే భీమ్ కొరోగామ్ మహార్ రెజిమెంట్ విజయ్ దివస్-206వ మహోత్సవాలను జయప్రదం చేయాలని దళిత బహుజన పార్టీ తెలంగాణ రాష్ట్ర కో-ఆర్డినేటర్ దాసరి భాస్కర్ పిలుపునిచ్చారు. వర్ణ, కుల వ్యవస్థలతో నిమ్న జాతుల మానవ హక్కులను నిరాకరించిన మనువాదుల హంతకుల పిష్వా వైదిక మత బ్రాహ్మణ రాజ్యంను ఓడించి సమాధి చేసి పీడిత జాతులకు ఆత్మగౌరవం, స్వేచ్ఛా, సమానవత్వం కల్పించి నూతన జీవితాన్ని అందించిన మహార్ రెజిమెంట్ పోరాట వీరుల త్యాగాలను ఆరోజున స్మరించుకోవడం జరుగుతుందన్నారు. మహారాష్ట్రలోని పూణే దగ్గరలోని భీమా నది ఒడ్డున నిర్మించిన మెహార్ రెజిమెంట్ వీరుల స్మారక భారీ స్థూపం వద్ద జనవరి 1న ప్రతియేడాది లక్షలాది మంది ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టి జాతులు నివాళులర్పించి మహోత్సవాలు నిర్వహించడం జరుగుతున్నదన్నారు. ఆదే రోజున దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో మహోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా జనవరి 1న ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని భాస్కర్ చెప్పారు.

## సింగరేణిలో ఎఐటియుసి విజయం సాధించడం కార్మికుల మనస్సాక్షిని ప్రతిభింబిస్తుంది



సంబరాలు జరుపుకుంటున్న ఎఐటియుసి నాయకులు

**సైఫాబాద్, డిసెంబరు 28 ప్రభాతవార్త:**
సింగరేణి కాలరీస్ గుర్తింపు సంఘంకు జరిగిన ఎన్నికల్లో ఎఐటియుసి విజయం సాధించడం సింగరేణి కార్మికుల మనస్సాక్షిని ప్రతిభింబిస్తుందని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.డి.యూసఫ్, ఎస్.బాల్‌రాజ్ స్పష్టం చేశారు. సింగరేణి కాలరీస్‌లో కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న యూనియన్‌లను తిరస్కరించి ఎఐటియుసిని గెలిపించిన కార్మికులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి కాలరీస్‌లో జరిగిన ఎన్నికల్లో ఎఐటియుసి విజయం సాధించిన సందర్భంగా గురువారం హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి భవన్‌లో పెద్ద ఎత్తున సంబరాలు జరిగాయి. కార్మికులు బాణా సంచాలను కాల్చారు. మిఠాయిలు పంపిణి చేశారు. ఎఐటియుసి జెండాలను రేపరేపలాడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొగ్గు గనుల్లో కార్మికులు పడిన కష్టాలు వర్ణించలేనవిని, బూర్జువా యూనియన్‌ల కార్మిక వ్యతిరేక వైఖరి కారణంగా వాటిని తిరస్కరించి నిజమైన పోరాట శక్తి ఎఐటియుసిదేనని వారు గుర్తించి ఎఐటయుసి అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌ను కార్మికులు గెలిపించారన్నారు. గనుల ప్రైవేటీకరణపై ఆందోళనలు తీవ్రతరం చేస్తామని బాల్‌రాజ్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించరు. ఎఐటియుసి రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మ మాట్లాడుతూ గని కార్మికుల సమస్యలను పరిష్కారించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి సీనియర్ నాయకుడు ఉజ్జని రత్నాకర్‌రావు, నాయకులు బి.వెంకటేశం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### అంబరానికేగిన అమృతమూర్తులకు 'సంగీత నీరాజనం'

**చిక్కడపల్లి, డిసెంబరు 28 ప్రభాతవార్త:** ఎందరో మహానుభావులు, అందరికి వందనాలు, అంబరానికేగిన అమృతమూర్తులకు 'సంగీత నీరాజనం' పేరుతో గురువారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళావేంకట దీక్షితులు కళావేదికలో కళానిలయం సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. నిర్వాహక సంస్థ అధినేతలు ఎ.పుష్పలత, ఎ.సురేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత పోలీసు ఉన్నతాధికారి సుంకర సత్యనారాయణ హాజరై 'అన్నపూర్ణమ్మ గారి మామవాడు' చిత్ర డైరెక్టర్ శివనాగుకు 'కళాభారతి జమున' అవార్డును అందించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు షేక్ పర్వేజ్, వైఎస్ఆర్ చారిటబుల్ మేనేజింగ్ ట్రస్టీ వైఎస్ఆర్.మూర్తి, చేనేతవర్గాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాస్, విజయ చిత్ర ఎడిటర్ విజయ గుర్రపు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలలో భాగంగా గాయకుడు బాపిరాజు స్వరసారధ్యంలో గాయనీ గాయకులు సుబ్బిరెడ్డి, ఎం.నందగోపాల్, డాక్టర్ నాగేశ్వరరావు, అరుణ, రజనీ, నర్మద, వాణి, ప్రసాదరావు, ప్రభాకర్‌శర్మ నిర్వహించిన స్వరనీరాజనం కార్యక్రమం అద్భుతంగా సాగింది.


శివనాగుకు 'కళాభారతి జమున' అవార్డును అందించిన దృశ్యం

# అంబర్‌పేటలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**హైదరాబాద్, డిసెంబరు 28 ప్రభాతవార్త**
కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అంబర్‌పేట కంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.రోహిన్‌రెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. అంతకు ముందు పిసిసి కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్, ఏ.జ్యోతి ఆధ్వర్యంలో వికలాంగురాలుకు ట్రైసైకిల్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీ జాతీయ కాంగ్రెస్ 139వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలకు, అభిమానులకు, నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. 1885 డిసెంబరు 8న బొంబాయిలో 72 మందితో ఏర్పడ్డ జాతీయ కాంగ్రెస్‌పార్టీ నేడు దేశంలోని 140 కోట్ల ప్రజల హృదయాలను గెలుచుకుందన్నారు. దేశ స్వాతంత్రం కోసం ప్రజల్లో జాతీయ భావాన్ని రేకెత్తించి బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన పార్టీ కాంగ్రెస్ అని చెప్పుకొచ్చారు.సోనియమ్మ, పీవీ, మన్మోహన్, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ లాంటి వాళ్ల దేశం కోసం నిరంతరం శ్రమించారని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన తెలంగాణ ప్రజల 60 ఏళ్ల ఆకాంక్షలను తీర్చినా ఆది కాంగ్రెస్ పార్టీ వల్లనే సాధ్యం అయ్యిందని చెప్పుకొచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కృషి ఫలితంగా అధికారంలోకి వచ్చామన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని విజయ తీరాలకు తీసుకెళ్లి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని కోరారు.రాహుల్ గాంధీ త్వరలో చేపట్టే యాత్రను విజయవంతంగా చేపట్టాలని, ప్రతి కార్యకర్త తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆర్.లక్ష్మణ్‌యాదవ్, దిడ్డి రాంబాబు, గరిగంటి రమేష్, పులి జగన్, కె.గోవర్ధన్‌రెడ్డి, అజేయ్‌కుమార్, షౌకత్ అలీ మహ్మద్, యూత్ కాంగ్రెస్ నాయకుడు సాయి కిరణ్, సోను, మహేష్, సునిల్‌కుమార్, జి.మల్లేష్ పాల్గొన్నారు.


వికలాంగురాలుకు ట్రైసైకిల్ అందజేస్తున్న కంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ రోహిన్‌రెడ్డి, చిత్రంలో పిసిసి కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్, ఏ.జ్యోతియాదగిరిగౌడ్ తదితరులు

# బేగంపేట హెచ్‌పీఎస్‌లో ముగిసిన శతాబ్ది ఉత్సవాలు


శతాబ్ది ముగింపు ఉత్సవాలలో సందడి.

**బేగంపేట డిశంబరు 28,ప్రభాతవార్త**
బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూలు శతాబ్ది ఉత్సవాలలో పాల్గొనడం ఎంతో ఆహ్లాదాన్ని పంచిందని,అడోబ్ సీ ఈ ఓ శంతనూ నారాయణ్ అన్నారు.ఈ ఏడాది జనవరి 2023లో ప్రారంభమైన హెచ్‌పీఎస్ శతాబ్ది ఉత్సవాలు డిశంబరు నెలతో ముగిసాయి.బుధవారం రాత్రి హెచ్‌పీఎస్ లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు,సంగీత కార్యక్రమం ఆహుతులను ఉర్రూతలూగించాయి.ఒకవైపు పాఠశాల పూర్వ విధ్యార్థులు నిర్వహించే కార్యక్రమాలతో పాటు ఇక్కడ ఏర్పాటు చేసిన కార్ల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది.అలాగే పాఠశాల విధ్యార్థులు నేటి సామాజిక పరిస్థితులతో పాటు యూత్ పార్లమెంట్ నిర్వహించిన తీరు కూడా ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది.బుధవారం రాత్రి హైదరాబాద్ పబ్లిక్ స్కూలులో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో పాటు వివిధ విభాగాలలో పనిచేస్తూ సేవలు అందిస్తున్న సిబ్బందిని ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.వారి సేవలను కొనియాడారు.డిశంబరు 25నుంచి 27వరకు జరిగిన గ్రాండ్ ఫినాలే,తాజ్‌ఫలక్ నుమాలో పూర్వ విధ్యార్థుల విందు,ది ఈగల్స్ కార్నివాల్ ,ది వింటేజ్ మరియూ సూపర్ కార్ల షో, వర్క్‌షాపులు,ప్యానెల్ చర్చలు నిర్వహించారు.హైదరాబాద్ పబ్లిక్ స్కూలు సొసైటీ గౌరవ అధ్యక్షులు గుస్తీ జె నోరియా,హైదరాబాద్ పబ్లిక్ స్కూలు సొసైటీ కార్యదర్శి,కోశాధికారి జలగం వెంకటరావు సన్మాన కార్యక్రమానికి నాయకత్వం వహించారు.మాజీ అధ్యక్షులు ఎ.శ్యామన మోహన్,పి.జగదీష్ రెడ్డి,ఆర్.సురేందర్‌రెడ్డిలు వారి అమూల్యమైన సహకారాన్ని కొనియాడారు.ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ స్కంద్ బాలి,మాజీ ఉపాధ్యాయుడు మదన్‌లను సత్కరించారు.ప్రాక్టర్ అండ్ గాంబల్ సీఈఓ శైలేష్ జి బెజురికర్,అడోబ్ సీఈఓ శాంతను నారాయణ్,ఏషియన్ ఇనిసిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీఛైర్మన్ డి.నాగేశ్వరరెడ్డిలను గ్లోబల్ ఇంపాక్ట్ అవార్డుతో సత్కరించి వారు అందిస్తున్న సేవలను కొనియాడారు.ఈ ఈవెంట్‌లో పాఠశాల భవిష్యత్ కోసం మాస్టర్ ప్లాన్ ను ఆవిష్కరించే ఆకర్షణీయమైన వీడియో ప్రజెంటేషన్ ముఖ్య సహకారులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపే వీడియో,ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న కొత్త పాఠశాల లోగో లాంచ్ ను ఆవిష్కరించారు.ప్రఖ్యాత కళాకారుడు శంకర్ ఎహసాన్ లాయ్ ఆధ్వర్యంలో మంత్రముగ్ధులను చేసే సంగీత ప్రదర్శన ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది.

## ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహంకాళి ఏఎస్సై మృతి


చికిత్స పొందుతూ మృతి చెందిన ఏఎస్సై నన్యానాయక్

**బేగంపేట డిశంబరు 28,ప్రభాతవార్త**
ఈ నెల 18వ తేదీన రాష్ట్రపతి బందోబస్త్ విధులు నిర్వర్తించేందుకు వెళుతున్న మహంకాళీ పోలీస్‌స్టేషన్ ఏఎస్సై నన్యానాయక్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు.అప్పటి నుంచి సికింద్రాబాద్ లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏఎస్సై నన్యానాయక్ గురువారం మృతి చెందారు.విధులకు వెళుతున్న ఏఎస్సై నన్యానాయక్ బైకును అల్వాల్ బ్రిడ్జి వద్ద కారు ఢీ కొన్న ఘటనలో ఆయన తలకు బలమైన గాయమైంది.అప్పటి నుంచి ఆయన ఆస్పత్రిలోనే ఉన్నారు.గురువారం మధ్యాహ్నం ఆయన తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య,నలుగురు సంతానం ఉన్నారు.వారిలో ఒక అబ్బాయి,ముగ్గురు అమ్మాయిలు ఉన్నారు.వీరంతా వైద్యవృత్తిలో ఉన్నారు.ఏఎస్సై గాయపడిన నాటినుంచి ఆయనకు మెరుగైన వైద్య సహాయం అందించేలా చూడాలని ఆస్పత్రి వైద్యులను అనుక్షణం నగర పోలీస్ కమీషనర్ కొత్త కోట శ్రీనివాసరెడ్డి వారిని అప్రమత్తం చేసారు.నన్యానాయక్ మరణ వార్త తెల్సుకున్న సీపీ తీవ్ర విషాదాన్ని వ్యక్తం చేసారు.ఆయన అంత్య క్రియల ఖర్చులకు కోఆపరేటివ్ నుండి రూ 30,000లు,సీపీ వెల్ఫేర్ నుంచి రూ 20,000లను వారి కుటుంబసభ్యులకు అందజేసినట్లు హైదరాబాద్ సీటీ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నల్ల శంకరరెడ్డి తెలియజేసారు.పార్ధివ దేహాన్ని అతని స్వస్థలమైన నాగర్ కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం,మన్ననూర్ గ్రామానికి పోలీసు అంబులెన్స్‌లో తరలించేలా ఏర్పాట్లు చేసినట్లు శంకరరెడ్డి తెలియజేసారు.మృతదేహాన్ని నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని,మహంకాళీ ఏసీపీ రవీందర్‌యాదవ్,మహంకాళీ ఇన్స్‌పెక్టర్ పరుశురాం సిబ్బంది సందర్శించి నివాళులు అర్పించారు.

## జనవరి 7న ఎఫ్‌ఎల్‌వో బిజినెస్ అవార్డ్స్


కార్యక్రమ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

**హైదరాబాద్, డిసెంబరు 28,ప్రభాతవార్త:**
ఫిక్కీ లేడిస్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌ఎల్‌వో), యంగ్ ఫిక్కీ లేడిస్ ఆర్గనైజేషన్(వైఎఫ్‌ఎల్‌వో) తమ వార్షిక బిజినెస్ అవార్డ్సు ప్రకటించాయి. గురువారం సోమాజిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఛైర్‌పర్సన్ రీతూషా, గత ఛైర్‌పర్సన్ హీనా శ్రీవాస్తవ, ఆర్తీషా, అపూర్వలు అవార్డు కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని వివిధ పరిశ్రమల రంగాలకు ప్రాతినిధ్యం వహిస్తు విజయవంతమైన మహిళలకు ఈఅవార్డులు అందజేస్తామన్నారు. జనవరి 7న జరిగే ఈఅవార్డుల ప్రధానోత్సవానికి మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్కలు ముఖ్యఅతిధులుగా హాజరై అవార్డులను అందజేస్తారని తెలిపారు. ముఖ్యంగా సోషల్ ఎంటర్‌ప్రైజ్, సుస్థిరత, విద్య, ఆరోగ్య సంరక్షణ, వెల్‌నెస్, సౌందర్యం, అవిష్కరణ, సాంకేతిక,కళా, సంస్కృతి సేవా వంటి విభాగాల్లో అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు.

## ముగ్ధమనోహరం శ్రీయ కూచిపూడి రంగప్రవేశం

**రవీంద్రభారతి, డిసెంబరు 28 ప్రభాతవార్త :**
అభినయ కూచిపూడి కళాక్షేత్రం ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధానమందిరంలో ప్రఖ్యాత నాట్యగురువు పావని శ్రీలత ప్రసాద్ శిష్యురాలు శ్రీయ పన్నాల కూచిపూడి రంగప్రవేశం ఆదిలోనే అదరగొట్టి విచ్చేసిన అశేష ప్రేక్షకుల ప్రశంసలు, మన్ననలు అందుకుంది. శ్రీయ తన కూచిపూడి రంగప్రవేశాన్ని ముందుగా బేడరాగం, ఆదితాళంలో గణేశస్తుతి-తాండవ గణపతిం భవయేతో ప్రారంభించి తదుపరి మోహనరాగం ఆదితాళంలో కృష్ణజననం శబ్దం, గాయత్రీదేవి ప్రవేశ ధరువు, వసంతరాగం ఆదితాళంలో అన్నమాచార్య కీర్తన-కలసాపురము కదా, కీరవాణిరాగం ఆదితాళంలో బాలసరస మురళి, తోడిరాగం ఆదితాళంలో మాయలాడి-జావళి, చివరిగా సూరతిరాగం ఆదితాళంలో శృతి తిల్లానా అంశాలను శృతి లయబద్ధం, హావభావ, ముఖకవళికల అద్భుత ప్రదర్శనను ముగ్ధమనోహరంగా శ్రీలత ప్రసాద్ నట్టువాగం, కొరియోగ్రఫీ, కె.చంద్రరావు గాత్రం, ఎం.చంద్రకాంత్ మృదంగం, శ్రీసాయి వయోలిన్, విబిఎస్.మురళీ వేణువు, జయకుమార్ ఆచార్య తబలపై అద్భుత వాయిద్య సహకారం అందించగా మరింత రక్తికట్టించి ఆహుతులను మంత్రముగ్ధులను చేసింది.


శ్రీయ కూచిపూడి రంగప్రవేశంలో ఒక దృశ్యం

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఆరు గ్యారంటీల పత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి తదితరులు

**తుర్కయంజాల్, డిసెంబరు 28 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలను నిలబెట్టుకునేందుకు కృషి చేస్తోందని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ నక్క శివలింగంగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తొర్రూరు వార్డు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు గ్యారెంటీ పథకాల గురించి ఎలా దరఖాస్తులు చేసుకోవాలో ప్రజలకు వివరించారు. ప్రజాపాలన అభయహస్తం ఆరు గ్యారంటీల లోగో, పోస్టర్, దరఖాస్తు ఫారంను విడుదల చేశారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. నిధులు దుర్వినియోగం కాకుండా చూస్తే పథకాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్, నాయకులు వంగేటి గోపాల్‌రెడ్డి, మేకనీ అంజయ్య, రమేష్, మున్సిపాలిటీ సిబ్బంది ప్రవీణ్ కుమార్, భాను తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలతో ప్రజలకు ఎంతో మేలు



సాయికుటీర్‌లో పథకాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి



హయత్‌నగర్‌లో దరఖాస్తు పత్రాలను పరిశీలిస్తున్న నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, డిసెంబరు 28 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6గ్యారెంటీల పథకాన్ని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని పెద్దఅంబర్ పేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ చెవుల స్వప్న అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 2, 3 వార్డులలో ఆరు గ్యారెంటీల పథకాన్ని స్థానిక కౌన్సిలర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీలతో పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు చేకూరుతుందని, అర్హులు ఈ పథకాలకోసం కార్యాలయాలచుట్టూ తిరగకుండా ప్రజా పాలన కార్యక్రమంలో తమ దరఖాస్తులను పూర్తి చేసి అధికారులకు అందజేయాలని తెలిపారు. 9వ వార్డు సాయికుటీర్‌లో కౌన్సిలర్ చల్లూరి మురళీధర్ రెడ్డి ఆరు గ్యారెంటీల పథకాన్ని ప్రారంభించి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, మేనేజర్ కిరణ్‌కుమార్, మున్సిపాలిటీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

**సరిపడ దరఖాస్తు పత్రాలను ఉంచాలి: కార్పొరేటర్ నవజీవనరెడ్డి...** హయత్‌నగర్ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన ఆరుగ్యారెంటీల దరఖాస్తు స్వీకరణ కేంద్రాలను కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి పరిశీలించారు. ప్రజలు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరుగ్యారెంటీల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వార్డు కార్యాలయంతోపాటు,కమలానగర్, రాఘవేంద్రకాలనీ, డిఫెన్స్‌కాలనీ కమ్యూనిటీ హాళ్లలో దరఖాస్తు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. దరఖాస్తులు సరిపడ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సరిపడ దరఖాస్తు పత్రాలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గణేష్‌నేత, ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 28 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ టెలిఫోన్ కాలనీ, ఎన్టీఆర్‌నగర్ చౌరస్తాలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, రాష్ట్ర యువజన నాయకులు చిలక ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం జెండా ఆవిష్కరణ చేశారు. రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి మధు, తల్లాటి రమేష్‌నేత, ఎన్‌ఎస్‌యుఐ శివ, పున్న కృష్ణయ్య, జెల్ల జగన్నాథం, పొట్టబతిని నగేష్, ప్రజాపతి, సంగం రమేష్, జ్ఞానేశ్వర్‌యాదవ్, సంపత్, శ్రీకాంత్ రెడ్డి, చిలుకూరి లక్ష్మీరామాచారి, రేణుక, జయశ్రీ, సంతోష, మమత, రమాదేవి, స్వరూప, కవిత, మాధవి , లావణ్య, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ లాభాల్లో రైతులకు 10 శాతం డివిడెండ్లు: ఛైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డి



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సొసైటీ ఛైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 28 ప్రభాతవార్త:** బాలాపూర్ కేంద్రంగా పని చేస్తున్న బండ్లగూడ ఖాల్సా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆర్జించే లాభాల్లో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సారి కూడా రైతులకు 10 శాతం డివిడెండ్ ఇస్తామని సంఘ ఛైర్మన్, డిసిసిబి మాజీ ఛైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డి వెల్లడించారు. బాలాపూర్‌లోని సంఘ కార్యాలయంలో ఛైర్మన్ అధ్యక్షతన సిఇఒ ఎర్ర జైహిందకుమార్ ఆధ్వర్యంలో సంఘ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం అనంతరం సొసైటీ నెలవారీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీనిచ్చిందనీ ప్రభుత్వం ఉత్తర్వులు వెలువడాల్సి ఉన్నందున రైతులు తీసుకున్న పంట రుణాలకు వడ్డీలు కట్టాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ కొలన్ తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు కళ్లెం నిరంజన్‌రెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, కొంతం అరుణారెడ్డి, నీరుడు నర్సమ్మ, రావుల లింగం, కొంతం సంపత్‌రెడ్డి, మేకల మహేందర్, ఇబ్రాం బాలయ్య, పన్నాల గోపాల్‌రెడ్డి, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, సంఘ సలహాదారుడు పగుడాల ఈశ్వర్‌గౌడ్, సిబ్బంది శ్రీకాంత్‌గౌడ్, రాధ, సాయి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులు ఆరు గ్యారంటీలను సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 28 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలనలో ఆరు గ్యారంటీలను సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ సర్కిల్‌లోని వివిధ ప్రాంతాల్లో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల్లో ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. వీటిని అధికారులు పరిశీలించి అర్హులకు పథకాలను అందజేస్తారని తెలిపారు. డిసి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉప్పల్ సర్కిల్‌లోని 4 డివిజన్లలో ముందుగా నిర్ణయించిన మేరకు ఆయా కేంద్రాలనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, మొదటిరోజు మొత్తం 4079 దరఖాస్తులు వచ్చాయని, ఇతర సమస్యలపై 611 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసి శ్రీనివాస్, బిఆర్ఎస్ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరూ ఆరు పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి : ఎమ్మెల్యే బలాల



ప్రజలకు దరఖాస్తులను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్‌పేట, డిసెంబరు 28 ప్రభాతవార్త:** అర్హులైన వారందరూ ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకోవాలని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రాలనుఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో అధికారులు, సిబ్బంది పర్యటించి ప్రజలనుంచి 6 గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట సర్కిల్-6 కార్యాలయం స్పెషల్ అధికారి ఎ.కృష్ణ, సౌత్‌జోన్ జడ్‌సి వెంకన్న, డిసి జయంత్, అధికారులు సునీత, పీర్‌సింగ్, ఉపేందర్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

## పనులు త్వరగా పూర్తి చేయాలి : భాగ్యలక్ష్మి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి తదితరులు

**మలక్‌పేట, డిసెంబరు 28 ప్రభాతవార్త:** అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని శాలివాహననగర్, పెద్ద బజార్ వద్ద సుమారు రూ. 60.07 లక్షలో నిర్మించనున్న సిసి రోడ్డు, బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి, స్థానికులు గున్న ప్రభాకర్, యాదగిరి, నర్సింహ్మా, దినేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : షేక్ అక్బర్



కాంగ్రెస్ జెండాను ఎగరవేసి మాట్లాడుతున్న షేక్ అక్బర్ తదితరులు

**మలక్‌పేట, డిసెంబరు 28 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే కంటెస్టెడ్ అభ్యర్థి షేక్ అక్బర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మలక్‌పేటలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన ఆవిర్భావ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి జెండాలను ఎగురవేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రజా పాలన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అర్హులనుండి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపట్టిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**బొల్లు కిషన్ ఆధ్వర్యంలో...**కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా మలక్‌పేటలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ జెండావిష్కరణ చేసారు. ఈ కార్యక్రమంలో కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చౌకి రవికుమార్, బాబు శ్రీనివాస్, బాలకృష్ణయాదవ్, కిషన్‌సింగ్, సురేష్‌కుమార్, కావేటి గంట్ల కృష్ణ, మహేష్,శ్రీకాంత్, మహేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



దరఖాస్తు ఫారాలను అందజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

**వనస్థలిపురం, డిసెంబరు 28 ప్రభాతవార్త:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ఏర్పాటుచేసిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో కార్పొరేటర్ లచ్చిరెడ్డి పాల్గొని అర్హులైనవారికి దరఖాస్తుల పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలకు సంబంధించి అర్హులందరూ సంబంధిత దరఖాస్తు పత్రాలను పూర్తి చేసి పత్రాలను అధికారులకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి, అధికారులతోపాటు నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## థీమ్ పార్క్ పనుల పరిశీలన : సుధీర్‌రెడ్డి



థీమ్ పార్క్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**వనస్థలిపురం, డిసెంబరు 28 ప్రభాతవార్త:** బి.ఎన్.రెడ్డినగర్ డివిజన్‌లోని ఫేస్-3లో కోటి ఇరవై అయిదు లక్షల రూపాయల వ్యయంతో హెచ్ఎండిఏ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న థీమ్ పార్క్ పనులను ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాదాపు ఒక ఎకరం స్థలంలో అద్భుతమైన థీమ్ పార్క్ నిర్మించడం జరుగుతుందని, ఇందులో అద్భుతమైన బుద్ధ విగ్రహం, యోగ చేసుకోవడానికి స్థలం, ఓపెన్ జిమ్, చిల్డ్రన్ ప్లేపార్క్, వాకింగ్ ట్రాక్, అద్భుతమైన గార్డెన్ నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే సగం పనులు పూర్తిచేసామని, పనుల్లో వేగం పెంచి త్వరలోనే అందుబాటులోకి తీసుకొనివస్తామన్నారు. నియోజకవర్గ అబివృద్దే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ భారస అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, అనిల్‌చౌదరి, రాఘవేంద్రరావు, సుజిత్ పాల్గొన్నారు.

## ఆరు పథకాలపై వాలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించాలి: పవన్‌కుమార్



దరఖాస్తులను స్వీకరిస్తున్న చంద్రకాంత్‌రెడ్డి, పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 28 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ కమర్షియల్ టాక్స్ కాలనీలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమం ప్రారంభోత్సవంలో అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వాలంటీర్లు ప్రజలకు దగ్గరుండి వారికి అవగాహన కల్పించాలని, ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజలందరూ 6 గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం కొత్తపేట వార్డు కార్యాలయం, స్నేహపూరి సీనియర్ సిటిజన్స్ ఫోరం బిల్డింగ్, ఆర్టీసీకాలనీ సెంటర్‌లను పర్యవేక్షించి ప్రజల సౌకర్యాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు విక్రాంత్‌రెడ్డి, ఏఈ మాత్రునయక్, స్నేహపూరికాలనీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కిరణ్మయి, మాధవ్‌రెడ్డి, సత్యనారాయణ, గీతారెడ్డి, మధుసూధన్‌రెడ్డి, జ్ఞానకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ సర్కిల్‌లో ఘనంగా కాంగ్రెస్ పార్టీ అవిర్బావ దినోత్సవ వేడుకలు



ఉప్పల్‌లో కాంగ్రెస్ పార్టీ అవిర్బావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న నేతలు

**ఉప్పల్, డిసెంబరు 28 ప్రభాతవార్త :** ఉప్పల్‌లో కాంగ్రెస్ పార్టీ అవిర్బావ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఉప్పల్ నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నేత దుబ్బ నరసింహారెడ్డి, కంది ఆగిరెడ్డి, జి.కృష్ణారెడ్డి, బోరంపేట కృష్ణ, బజారు జగన్‌గౌడ్, సి.రఘుపతిరెడ్డి, తవిడబోయిన గిరి బాబు, తెల్కల మోహన్‌రెడ్డి, సుర్వి మురళీ, సుధాకర్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగపల్లి రామకృష్ణ, బాకారం లక్ష్మణ్, బాలరాజు, ఎం.డి.రఫీక్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కంది శ్రవణ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అకారపు అరుణ్‌కుమార్, శివ, జలీల్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు అమేశ్వరి, సుశీల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ పార్టీ పాల్గొందని, దేశ ప్రజలకు స్వేచ్ఛ వాయువులు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. ఈ సందర్భంగా మేకల శివారెడ్డి జెండా అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఉపేందర్‌రెడ్డి, తుమ్మల దేవిరెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, మంద మురళీకృష్ణారెడ్డి, సుధాకర్, గొరిగె మహేష్, శేఖర్‌రెడ్డి, సందీప్, కృష్ణారెడ్డి, అనిల్‌కుమార్, సంజీవరెడ్డి, బాస్కర్, రామకృష్ణ, లక్ష్మణ్, రఘు, కన్నమైన నరేష్, సుమన్‌రెడ్డి, జిత్తు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో దరఖాస్తుల స్వీకరణ



ప్రజలకు దరఖాస్తులు అందజేస్తున్న టిపిసిసి కార్యదర్శి కోట్ల శ్రీనివాస్





సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి
ప్రజలకు దరఖాస్తులు అందజేస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 28 ప్రభాతవార్త:** ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి దరఖాస్తు చేసుకోవడానికి గురువారం నుంచి ప్రారంభమైన ప్రజా పాలన కార్యక్రమాన్ని ఐఎస్ సదన్, సైదాబాద్, లింగోజిగూడ, చంపాపేట డివిజన్లలో కార్పొరేటర్లు, స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఐఎస్ సదన్ డివిజన్‌లో టిపిసిసి కార్యదర్శి కోట్ల శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి, లింగోజిగూడ డివిజన్‌లో కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డిలు దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించారు. ప్రజా పాలన మొదటి రోజు ప్రజలు పెద్ద ఎత్తున కేంద్రాలకు తరలివచ్చి దరఖాస్తులను సమర్పించారు. మరికొంత మంది సెంటర్ల వద్దకు వచ్చి ఆయా సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేయడానికి కావాల్సిన పత్రాల గురించి వాకబు చేశారు.

## కాంగ్రెస్ పాలనలో ప్రతి పేద కుటుంబానికి న్యాయం: మేయర్ చిగిరింత పారిజాత




ప్రజాపాలన వార్డు సభలో ప్రసంగిస్తున్న మేయర్ చిగిరింత పారిజాత

**సరూర్‌నగర్, డిసెంబర్ 28 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాపాలన ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరుగుతుందని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన సందర్భంగా నాదర్‌గుల్ అంబేద్కర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభి మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ అనీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో 6 గ్యారంటీల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అర్హులైన ప్రజలు సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ బడుగు సుమన్‌రావు, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, స్థానిక నాదర్‌గుల్ కార్పొరేటర్లు గూడెపు ఇంద్రసేన, తోట శ్రీధర్‌రెడ్డి, మర్రి హనుమంత్‌రెడ్డితో పాటు కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, బండారి మనోహర్, నేనావత్ బాలు నాయక్‌లతో పాటు నాయకులు పుట్టగళ్ల జగన్, బంగారు అశోక్, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, సుభాన్ యాదవ్, గట్టు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**సరూర్‌నగర్, డిసెంబర్ 28 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్, అల్మాస్‌గూడలలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కాంగ్రెస్ పార్టీ పతాకాలను ఆవిష్కరించి మాట్లాడుతూ కాంగ్రెస్ వల్లే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రాళ్లగూడెం సంతోష శ్రీనివాస్‌రెడ్డి, బండారి మనోహర్, నేనావత్ బాలు నాయక్, కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ యువజన కాం గ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, మాజీ వార్డు మెంబర్ భీమిడి చంద్రపాల్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నవారు మల్లారెడ్డి, గట్టు బాలకృష్ణలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## సిర్లాహిల్స్‌లో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ

**సరూర్‌నగర్, డిసెంబర్ 28 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 27వ డివిజన్ సిర్లాహిల్స్‌లో గురువారం ప్రజా పాలన వార్డు సభ నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ గ్యారంటీల కోసం అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయడానికి దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. స్థానిక కార్పొరేటర్ పసునూరి బిక్షపతిచారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి కార్పొరేషన్ కమీషనర్ వాణిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వ గ్యారంటీల కోసం దరఖాస్తు చేసే వారిలో అర్హులైన వారిని మాత్రమే ఎంపిక చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నూకల వెంకట్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు పల్లె జంగయ్యగౌడ్, సూపర్‌వైజర్ బాలకృష్ణ, అంగన్‌వాడి టీచర్ అరుణ, ఆశా వర్కర్ మానస, మహిళా గ్రూపు మెంబర్లు ప్రగతి, పద్మశ్రీ, కాలనీవాసులు చందు, రమేష్, గోపాల్, సత్తయ్య, వెంకటయ్య, మనోహర్, శివకుమార్ చారి, జయమ్మ, మంజుల, పల్లవి, అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్టియన్ మైనార్టీల అభ్యున్నతికి కృషి : ఎమ్మెల్యే

**ఉప్పల్, డిసెంబరు 28 ప్రభాతవార్త :** క్రిస్టియన్ మైనార్టీల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ సర్కిల్ చిలుకానగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న క్రిస్మస్ కానుకలను అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఏటా క్రిస్టియన్ మైనార్టీలకు తగు చేయూత అందిస్తుందని, వీటిని ప్రతి ఒక్కరు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు నెర్థం భాస్కర్‌గౌడ్, బన్నాల ప్రవీణ్, పి.నర్సింగ్‌రావు, కొండల్‌రెడ్డి, కె.జగన్, నరేష్, రమేష్‌గౌడ్, నర్సింగ్‌రావు, సత్యరాజ్‌గౌడ్, మల్లేష్, పరమేష్, ప్రవీణ్, నవీన్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికి ప్రభుత్వ పథకాలు : చేతన

**ఉప్పల్, డిసెంబరు 28 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్‌లో అర్హులైన పేదలందరూ ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన సూచించారు. ఈ మేరకు గురువారం హబ్సిగూడ డివిజన్ పరిధిలోని స్నేహనగర్ వార్డు కార్యాలయంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ప్రభుత్వం వివిధ పథకాలు చేపట్టిందని, వీటికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి సంగీత, ప్రాజెక్ట్ అధికారి రమాదేవి, ఎఇ రాంరెడ్డి, పలువురు అధికారులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో ధరఖాస్తులు చేసుకోవాలి





దరఖాస్తులను తీసుకుంటున్న కార్పొరేటర్లు శాంతిశేఖర్, పన్నాల దేవేందర్‌రెడ్డి

**నాచారం, డిసెంబర్ 28 ప్రభాతవార్త:** ప్రభుత్వం అందజేస్తున్న వివిధ సంక్షేమ పథకాల కోసం ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకొని లబ్దిపొందాలని కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. గురువారం ప్రజాపాలన సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ డివిజన్‌లలో నాలుగు సెంటర్లలో ధరఖాస్తులను తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాస్, ముత్యం రెడ్డి, విఠల్ యాదవ్, కట్టబుచ్చన్న గౌడ్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

**ప్రజా పాలన సెంటర్‌ను ప్రారంభిస్తున్న పన్నాల...** ఓల్డ్ మల్లాపూర్‌లో ప్రజా పాలన సెంటర్‌ను కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు పడకుండా తగిన జాగ్రత్తలను సిబ్బంది తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ రూపా, వార్డు ఆఫీసర్ రాజు గౌడ్, వెంకటేష్ గౌడ్, ఊర్మిళ, స్వప్న, నరేష్, నవీన్, ప్రభాకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## అర్హులందరూ గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేయండి: ఎర్ర మహేశ్వరి

**సరూర్‌నగర్, డిసెంబర్ 28 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న గ్యారంటీ పథకాల ద్వారా లబ్ధిపొందడానికి అర్హులైన పేదలందరూ దరఖాస్తు చేసుకోవాలని బడంగ్‌పేట్ కార్పొరేషన్ 16వ డివిజన్ బాలాపూర్ కార్పొరేటర్ ఎర్ర మహేశ్వరి జైహింద్ పిలుపునిచ్చారు. ప్రజా పాలనలో భాగంగా బాలాపూర్‌లోని బిసి యువజన సంఘం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె కాంగ్రెస్ గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తు చేసే ఫారాలను ఆమె ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసి ప్రభుత్వ పథకాల కోసం అర్హులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు బాల్‌నింగని జంగయ్య, తూళ్ళ సునీతగౌడ్ తదితరులు పాల్గొన్నారు.